## క్లుప్తంగా

### పోషకాహారంపై అవగాహన



వెంకటాచలం: గర్భిణులు, బాలింతలు పోషకాహారంపై సరైన అవగాహన కలిగి ఉండాలని సుపోషణ్ ప్రాజెక్ట్ అధికారిణి కొంగి మాతమ్మ సూచించారు. అదాని ఫౌండేషన్, అదాని విల్మార్ ఆధ్వర్యంలో సుపోషణ్ ప్రాజెక్ట్ సహకారంతో మండలంలోని నాగంబొట్లకండ్రిగలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. తొలుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాతమ్మ మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనతకు గురవకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. పోషకాహారం తీసుకుంటే పుట్టే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. రుతుక్రమ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం సొంతంగా ఎలా తయారు చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సుపోషణ్ ప్రాజెక్ట్ టీం సభ్యులు శోభ, కృష్ణవేణి, రేవతి, సుమతి, చందన, వనిత, అనిత, తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారుల భవిష్యత్‌కు భరోసా



మనుబోలు: విధివశాత్తు తండ్రులను కోల్పోయిన ఇద్దరు చిన్నారుల భవిష్యత్‌కు సేవానాథం ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి భరోసా కల్పించారు. బుధవారం ఆయన చిన్నారుల తల్లులను కలిసి పిల్లల చదువుకు అయ్యే ఖర్చును భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన ఖర్చులకు నగదు చెక్కులను అందజేశారు. గమ్మళ్లపాళేనికి చెందిన కోసూరు మహేష్ కొంత కాలం క్రితం గుండెపోటుతో మరణించాడు. అలాగే కాండ్ర మహేష్ అనే వ్యక్తి ప్రమాదంలో మృతి చెందాడు. వీరి హఠాన్మరణంతో పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీనాథ్‌రెడ్డి పిల్లల చదువుకు అయ్యే ఖర్చు భరించేందుకు ముందుకొచ్చారు. 2వ తరగతి చదువుతున్న కోసూరు మహేష్ కుమారుడు వెంకటసాత్విక్, 6వ తరగతి చదువుతున్న కాండ్ర మహేష్ కుమారుడు త్రిలోక్ ఎంత వరకు చదువుకుంటే అంత వరకు తాను చదివిస్తానని హామీ ఇచ్చారు. దీంతో శ్రీనాథ్‌రెడ్డికి పిల్లల తల్లులు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట ట్రస్ట్ సభ్యులు బొల్లు రాంప్రసాద్, ఏద్దల ప్రభాకర్, కిరణ్ చక్రవర్తి ఉన్నారు.

### కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ కార్డుల పంపిణీ


నెల్లూరు(బృందావనం): కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొననున్న ఏజెంట్లకు ఐడీ కార్డులను నెల్లూరు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం అందజేశారు. నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కౌంటింగ్ ఏజెంట్లకు సంబంధించిన పత్రాలను స్క్రూట్నీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కౌంటింగ్ జరగనున్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు ఏజెంట్లు నిర్దేశించిన సమయానికి హాజరుకావాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన ఐడీ కార్డులను విధిగా ధరించాలని తెలిపారు. ఏఆర్వో శర్మద, దేవీకుమారి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### హనుమజ్జయంతి ఉత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ చేశారు. స్వామివారు ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. అనంతరం నివేదన, హారతిని నిర్వహించారు. ఉభయకర్తలుగా స్వాతి, శ్రుతి, పుచ్చలపల్లి శ్రీరాములురెడ్డి, లీలావతి వ్యవహరించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకొని శబరి శ్రీరామక్షేత్రంలో విజయవాడకు చెందిన హనుమద్దీక్ష పీఠం భక్త బృంద ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అఖండ హనుమాన్‌చాలీసా పారాయణం ముగిసింది.

### కనులపండువగా కల్యాణోత్సవం



నెల్లూరు(బృందావనం): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనులపండువగా బుధవారం నిర్వహించారు. పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను జరిపారు. భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా ఘంటసాల రేవతికుమార్, ఉషారాణి దంపతులు వ్యవహరించారు. ఆమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

# ప్రగతి పథంలో దొరువులపాళెం

- ఒకే చోట గ్రామ సచివాలయం, ఆర్బీకే, విలేజ్‌క్లినిక్‌ల ఏర్పాటు
- ప్రతి వీధిలో డ్రైయిన్లు, సీసీరోడ్ల నిర్మాణం
- 417కుపైగా గృహాలు మంజూరు



సచివాలయ భవన నిర్మాణం

ముత్తుకూరు: మండలంలోని దొరువులపాళెం సచివాలయం పరిధిలోని దొరువులపాళెం, ఈపూరు పంచాయతీలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాలతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు సమకూరాయి. దొరువులపాళెంలో ఒకే ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. దొరువులపాళెం, ఈపూరు పంచాయతీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించేందుకు రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.17.60 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రైతులకు సేవలు అందించేందుకు రూ.21.70 లక్షలతో రైతు భరోసా కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారు. వాటి చుట్టూ ప్రహరీ నిర్మాణాన్ని సైతం చేపట్టడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. మరోవైపు ప్రతి వీధి సిమెంట్ రోడ్లతో కళకళలాడుతోంది. మచ్చుకు మట్టి రోడ్లు లేకుండా చేశారు. సవ్యంగా మురుగునీటి పారుదల కోసం డ్రైనేజీల నిర్మాణాన్ని పూర్తి చేశారు. చీకటిని పారదోలుతూ కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వెలుగులు ప్రసరించేందుకు చర్యలు తీసుకున్నారు. మరోవైపు దొరువులపాళెం పంచాయతీలోని జగనన్న కాలనీలో 347 ఇళ్లు మంజూరు చేశారు. ఈపూరు పంచాయతీలో మరో 70 ఇళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మన బడి నాడు–నేడు కింద పాఠశాల భవనాలు సరికొత్త శోభను సంతరించుకొన్నాయి. వీటికి తోడుగా దొరువులపాళెం సచివాలయం పరిధిలో ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ) ద్వారా రూ 25.70 కోట్ల మేర, పరోక్ష ప్రయోజనాలు (నాన్ డీబీటీ)ద్వారా మరో రూ .15.77 కోట్ల మేర పేదలకు లబ్ధి చేకూరింది.

### కోరిన పనులన్నీ మంజూరు

వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనలో పంచాయతీ అభివృద్ధికి కోరిన పనులనీ మంజూరు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గ్రామ పెద్దల సహకారంతో అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాం.

–మీదూరు సునందమ్మ, సర్పంచ్, దొరువులపాళెం

### మౌలిక వసతులు కల్పించాం



మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాం. ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశాం. వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైయిన్లు పూర్తి చేశాం.

–అనంతరాజు శశికుమార్, సర్పంచ్, ఈపూరు.



రైతు భరోసా కేంద్రం భవనం



విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

## చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీటీ జగదీష్‌బాబు

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి ఆలయంలో ఈ నెల 13 నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని డిప్యూటీ తహసీల్దార్ జగదీష్‌బాబు సూచించారు. చాముండేశ్వరీదేవి ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని ఈఓ బండి శాంతయ్యతో కలిసి ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ 13న ధ్వజారోహణం, 21న కల్యాణోత్సవం, 23న సిరిమాను, 24న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. బ్రహ్మోత్సవాలకు వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ వసుంధర, స్థానికులు పాల్గొన్నారు.

## ఏపీ హంస నూతన కార్యవర్గ ఎన్నిక



పొదలకూరు : ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీహంస)పొదలకూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదలకూరులో ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ బీ కమల్‌కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో నూతన అధ్యక్షురాలిగా బీ మంజుల, సహాధ్యక్షుడిగా కే బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా ఎం వెంకటేశ్వర్లు, ట్రెజరర్‌గా సీహెచ్ ప్రమీల, కార్యనిర్వాహక కార్యదర్శిగా జీ రవీంద్రబాబును ఎన్నుకున్నారు. అలాగే పబ్లిసిటీ సెక్రటరీగా మస్తానయ్య, ఉపాధ్యక్షులుగా లక్ష్మమ్మ, నరసమ్మ, సుశీల, పద్మావతి, అనసూయ, మహిళా కార్యదర్శి భువనేశ్వరీ, జాయింట్ సెక్రటరీలుగా మస్తానీబీ, మునిరాధిక, లావణ్య, సుజాత, రజిత, ఈసీ మెంబర్లుగా అరుణ, జ్యోతి ఎన్నికయ్యారు. వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్, ఓజిలి మెడికల్ ఆఫీసర్ డానియల్ అభినందించారు.

### ఎమ్మెల్యే ప్రసన్న గెలుపు తథ్యం

విడవలూరు: ఎవరు ఎన్ని పగటి కలలు కన్నా కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మరోసారి విజయం సాధించడం తథ్యమని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కొండూరు వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన ముదివర్తిలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. ఈ దఫా ఎన్నికలు ఎన్నడూ లేని విధంగా పేదలకు, పెత్తందారులకు మధ్యన జరిగాయని తెలిపారు. పేదలంతా జగన్‌మోహన్‌రెడ్డి వైపు నిలబడ్డారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసి ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకున్నారన్నారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పేద ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### పోరాట యోధుడు జక్కా వెంకయ్య



జక్కా వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బడుగు, బలహీన వర్గాల పక్షాన ఎన్నో పోరాటాలు సాగించిన యోధుడు జక్కా వెంకయ్య అని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం కొనియాడారు. జక్కా వెంకయ్య వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భూపోరాటాలు చేపట్టి ఎందరో పేదలకు భూములు అందించిన మంచి మనిషి వెంకయ్య అని కొనియాడారు. పేదల పక్షాన ఆయన చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. నేటి యువత ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

## జాఫర్‌సాహెబ్ కెనాల్‌లోకి వ్యర్థ జలాల విడుదల



జాఫర్ సాహెబ్ కాలువలో ప్రవహిస్తున్న వ్యర్థ జలాలు

తోటపల్లిగూడూరు: మండల రైతాంగానికి సాగునీరందించే ప్రధాన కాలువ జాఫర్‌సాహెబ్ కెనాల్‌లోకి వ్యర్థ జలాలను వదిలిపెడుతున్నారు. దీంతో సాగునీరు కలుషితమై పంటలు పండడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కోడూరు, వరిగొండ, మాచర్లవారిపాళెం కాలువలకు జాఫర్‌సాహెబ్ కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ఆయా కాలువల కింద సుమారు 22వేల ఎకరాల ఆయకట్టు ఉంది. నెల్లూరు రూరల్ మండలం అల్లీపురం సమీపంలో జాఫర్‌సాహెబ్ కాలువకు ఇరువైపులా ఉన్న పలు రైసు మిల్లులు, ఇతర పరిశ్రమల నిర్వాహకులు అందులోకి వ్యర్థజలాలను మళ్లించడంతో సాగునీరు కలుషితమవుతోంది. ఈ కారణంగా పంటలు పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలువలో ప్రవహిస్తున్న మురుగు దుర్గంధం వెదజల్లుతుండడంతో సమీప ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి అనాధికారికంగా పంటకాలువలోకి వ్యర్థజలాలను వదులుతున్న రైసుమిలులు, ఇతర పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఆట విడుపు అవసరం



క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

కొడవలూరు: విద్యార్థులకు విజ్ఞానంతో పాటు ఆటవిడుపు అవసరమని విశ్రాంత హెచ్‌ఎం వెంకయ్య అన్నారు. కొడవలూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం క్యారమ్స్, స్కిప్పింగ్ ఆడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసికోల్లాసాన్ని పొందవచ్చన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడల ద్వారా మంచి భవిష్యత్‌ను పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రాజేశ్వరి పాల్గొన్నారు.

### కాకాణి హ్యాట్రిక్ విజయం ఖాయం

నెల్లూరు(పొగతోట): ఈ ఎన్నికల్లోనూ సర్వేపల్లి నుంచి హ్యాట్రిక్ విజయాన్ని కాకాణి గోవర్ధన్‌రెడ్డి సాధించనున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటశేషయ్య పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే వ్యక్తి కాకాణి అని కొనియాడారు. ఎన్నికల నిబంధనలు టీడీపీ నేతలకు వర్తించవా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రత్యక్షమై ఐదేళ్లు పత్తాలేకుండాపోయే సోమిరెడ్డి తాటాకు చప్పుళ్లు, బెదిరింపులకు బెదిరేదిలేదని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తుందంటూ సోమిరెడ్డి పగటి కలలు కంటున్నారని విమర్శించారు. కోట్ల రూపాయలను ఖర్చు చేసి.. మద్యాన్ని ఏరులైపారించి గెలుస్తాననే భ్రమలో ఆయన ఉన్నారని పేర్కొన్నారు. ముత్తుకూరు మండలం పైనాపురం గిరిజన కాలనీలో టీడీపీ వారు ఘర్షణ పడి, దాన్ని తమ పార్టీకి ఆపాదించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ విషయమై పూర్తి అవగాహన లేకుండా పత్రికల్లో ప్రచురించడం దారుణమన్నారు. దీనిపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చర్యలు చేపట్టాలని కోరారు. నేతలు తలమంచి సురేంద్రబాబు, నెల్లూరు శివప్రసాద్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కల్లుగీత కార్మికుల సంక్షేమమే లక్ష్యం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న గౌడ సేవా సమితి ట్రస్ట్ సభ్యులు

తోటపల్లిగూడూరు: కల్లుగీత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు గౌడ, కల్లుగీత పారిశ్రామికుల సంఘ మరియు గౌడ సేవా సమితి ట్రస్ట్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ నెల 23న చిన్నచెరుకూరుకు చెందిన కల్లుగీత కార్మికుడు అన్నం నరసయ్య(55), అన్నం భాగ్యమ్మ(50) దంపతులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నరసయ్య కుమారులు రాకేష్, రాజేష్‌ను జిల్లా గౌడ సంఘ అధ్యక్షుడు తోటా ప్రభాకర్‌తో కలిసి కోసూరు రాజశేఖర్‌గౌడ్ బుధవారం పరామర్శించారు. వారికి రూ.20 వేల నగదు సాయం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ కల్లుగీతే ఆధారంగా జీవిస్తున్న గౌడ కులస్తులకు జిల్లా గౌడ సేవా సమితి ట్రస్ట్ అండగా ఉంటుందన్నారు. కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. బాధిత కల్లుగీత కార్మికుల కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నామన్నారు. అందులో భాగంగా అన్నం నరసయ్య కుటుంబ సభ్యులకు తమ వంతుగా అండగా నిలవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సేవా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి నడవడి ముత్యంగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పల రామకృష్ణయ్యగౌడ్, నాయకులు తాతా సుబ్బారావు, బండ్ల మహేష్‌గౌడ్, జానా రామచంద్రయ్యగౌడ్, జానా వరంధామయ్యగౌడ్, వెంపులూరు పుల్లయ్యగౌడ్, అంతటి ప్రసాద్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల్లో రక్తహీనత తలెత్తకుండా చర్యలు



రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: గిరిజనుల్లో రక్తహీనత తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ తెలిపారు. 'నేషనల్ సికెల్ సెల్ అనిమియా ఎలిమినేషన్ మిషన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని దామేగుంట గిరిజన కాలనీలో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు రక్తహీనతను ఎక్కువగా ఎదుర్కొంటున్న నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రక్తహీనత సమస్య కేన్సర్‌కు దారి తీసే ప్రమాదం ఉన్నందున ప్రతిఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి రక్తం తక్కువగా ఉన్న వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు పోషకాహారం తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం డీపీ రమణమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ డీ మహాలక్ష్మి, ఆశా కార్యకర్త భార్గవి పాల్గొన్నారు.

## పచ్చిరొట్టతో భూమి సారవంతం



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రఘునాథ్‌రెడ్డి

ఇందుకూరుపేట: పచ్చిరొట్ట పైర్లతో భూమిని సారవంతంగా మార్చుకోవచ్చని ఏఓ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేబూరులో భూసార పరిరక్షణపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తోందని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. భూసార పరీక్షలను చేయించుకుని అందుకు అనుగుణంగా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఇష్టానుసారంగా రసాయన ఎరువులను వినియోగిస్తే నేల స్వభావం కోల్పోయి, దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టిసారించాలని కోరారు. పంట సాగుకు ముందుగా పచ్చిరొట్ట పైర్లను సాగుచేసుకుని కలయదున్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ సుమలత, రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా ధ్వజారోహణం



శ్రీవారి పల్లకిసేవ



ఆభరణాలను బహూకరిస్తున్న దాతలు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని శ్రీలక్ష్మీగోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం దేవదేవేరుల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం సామూహిక లక్ష్మీనారాయణ పూజ నిర్వహించారు. ఉభయకర్తలుగా జనకల వెంకటనాగేంద్రరావు, లావణ్య వ్యవహరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంద్యాల రమణయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం శ్యామ్‌ప్రసాద్, చొప్పా వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాసులు, మురళి పాల్గొన్నారు.

### ఆభరణాలు బహూకరణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవదేవేరులకు ఎం శివశంకర్ దంపతులు ఆభరణాలను బహూకరించారు. గోల్డ్ కోటెడ్‌తో తయారు చేసిన ఆభరణాలను ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్షులు పెంద్యాల రమణయ్య దంపతులకు అందజేశారు.

# మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న వక్తలు

కొడవలూరు: ప్రభుత్వం సూచించన మెనూ ప్రకారం విద్యార్థులకు ఆరోగ్యకర భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్త మాల్యాద్రి సూచించారు. మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా వచ్చిన ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో తాజా కూరగాయలు, తాజా పప్పు దినుసులను వినియోగించాలని సూచించారు. ఎంఈఓ వసంతకుమారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన తయారీలో పరిశుభ్రత పాటించాలన్నారు. వంట పాత్రలను శుభ్రంగా శుద్ధి చేయాలన్నారు. వంట తయారు చేసే వారు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. వంద శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని సద్వినియోగం చేసుకునేలా రుచికరంగా వడ్డించాలని సూచించారు. అనంతరం వంట తయారీ విధానాన్ని స్క్రీన్‌పై ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయుడు అంకయ్య రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎస్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.